అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 27 ఫిబ్రవరి 2023

బోనాల్‌లో బీరప్ప పండుగ


గ్రామంలో కళాకారుల ప్రదర్శన

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని బోనాల్ గ్రామంలో మూడు రోజుల నుంచి బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు కొనసాగుతున్నట్టు మాజీ సర్పంచ్ కురుమ లక్ష్మీ సాయిలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యాదవులు కురుమ గొల్ల వారు గంగకు వెళ్లారు. యాదవుల ఇండ్లపైన సరుగు చల్లారు. సరుగు కార్యక్రమం ఆసక్తితో కొనసాగింది. సోమవారం బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని సావర్‌గావ్‌లో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కిషన్ పోవార్ ప్రారంభించినట్టు ఇన్‌చార్జి జేపీఎస్ సతీష్ తెలిపారు. సర్పంచ్ కిషన్ మాట్లాడుతూ ఉపాధి చట్టం కింద మంజూరైన రూ. 5 లక్షల నిధులతో పనులు ప్రారంభించినట్టు తెలిపారు. పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, జేపీఎస్ తదితరులు పాల్గొన్నారు.

గూడుకోసం పోరు..


నెహ్రూనగర్‌లోని నిరుపేదలతో మాట్లాడుతున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

- ఎర్రజెండాతో నెహ్రూనగర్ పేదల జంగ్ సైరన్
- యేండ్లుగా స్థలాల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని సర్కారు
- ఎర్రజెండా సమక్షంలో భూపోరాటం
- పేదలకు వెంటనే స్థలాలివ్వాలి : ప్రజాసంఘాలు నేతలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, నిజామాబాద్ సిటీ

'సారు మాకు తలదాచుకునేందుకు స్థలం ఇవ్వండి' అంటూ ఆ పేదలు పెట్టుకున్న మొర సర్కారు పెడచెవిన పెట్టింది. యేండ్లుగా తమ గ్రామానికి వచ్చిన ప్రతి నేతకు, అధికారికి 'అయ్యా' అంటూ అర్థించారు. కానీ ఆ పేదల, కార్మికుల సమస్యను ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. 50 యేండ్లుగా కిరాయి ఇండ్లల్లోనే నివసిస్తున్న పరిస్థితి. ఎదురుచూపులతో విసిగి వేసారిన ఆ పేదలు.. సొంత జాగ కోసం జంగ్ ప్రారంభించారు. ఎర్రజెండా చేతపట్టి భూమి కావాలంటూ నినదించారు. ఎర్రజెండా అండతో భూపోరాటానికి సిద్ధపడ్డారు. అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని చదునుచేసి గుడిసెలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.


గుడిసెలు వేసుకునేందుకు భూమిని చదును చేస్తున్న పేదలు, నాయకులు

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ వాసులు కొన్ని దశాబ్దాలుగా స్వంత ఇండ్లు లేక కిరాయి ఇండ్లలో జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల ముందు స్వంత స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వడం ఆ తరువాత దాటవేయడంతో షరామామలుగా సాగుతోంది. 'అయ్యా.. మాకు స్వంత స్థలాలు ఇస్తామన్నారు. ఇవ్వండి' అంటూ ఎమ్మెల్యే నుంచి మొదలు ముఖ్యమంత్రి వరకు వినతిపత్రాలు సమర్పించారు. కానీ సమస్యకు పరిష్కారం దొరకలేదు. ఏ ఒక్కరికీ స్వంత జాగా ఇచ్చిన పరిస్థితి లేదు. సుమారు రెండు వందల మంది వ్యవసేయతర కార్మికులు స్వంత ఇండ్లు లేక అవస్థలు పడుతున్నారు. పైగా నెహ్రూనగర్‌లో కిరాయికి ఇండ్లు కూడా దొరకలేని పరిస్థితి నెలకొంది. అద్దె భారాలు సైతం నిజామాబాద్ పట్టణంతో పొల్చితే ఎక్కువ భారంగా ఉండటం గమనార్హం. దీంతో వ్యవసాయేతర కార్మికులు పొద్దున నుంచి సాయంత్రం వరకు కష్టపడి చేసిన సంపాదనలో ఎక్కువ భాగం కిరాయిలకే చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత కొన్ని నెలలుగా దశలవారిగా పోరాటం ప్రారంభించారు. ఇది వరకే కలెక్టరేట్ కార్యాలయం వద్ద సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

భూపోరు ప్రారంభం..

ఇండ్ల స్థలాల కోసం దశాబ్దాల ఎదురుచూపులకు నెహ్రూనగర్ వాసులు తెరదించారు. పోరుబాటతోనే సాధించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు ఎర్రజెండా భూజన ఎత్తుకున్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌కు సమీపంలోని జాన్కంపేట శివారులోని ప్రభుత్వభూమిలో గుడిసెలు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. జాన్కంపేట శివారులో ఉన్న ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని చదును చేశారు.

స్థలాలు ఇచ్చే వరకు పోరాటం



పెద్ది వెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు చేసింది శూన్యం. నెహ్రూనగర్ వాసులకు ఇండ్ల స్థలాలు అందించడంతో పాటు ఇండ్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర సర్కారు రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లించాలి. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆపబోం.

పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి



నూర్జహాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

కేసీఆర్ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని హామీనిచ్చింది. గడిచిన తొమ్మిదేండ్ల పాలనలో నిజామాబాద్‌లో ఏ ఒక్కరికీ ఇండ్లు ఇచ్చిన దాఖలాలు లేవు. పేదలు స్వంత ఇండ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. నెహ్రూనగర్‌లోని పేదలకు వెంటనే స్థలాలు ఇవ్వాలి.

ఏండ్లుగా కిరాయి ఇండ్లల్లోనే



గంగమణి. నెహ్రూనగర్

నెహ్రూ నగర్‌లో ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడే నివాసం ఉంటున్నాం. ప్రతిసారి ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయ నాయకులు మీకు పక్క ఇండ్లు నిర్మించుటకు కృషి చేసిస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని వెళ్ళిపోతున్నారు తప్ప మాకోసం ఏం చేయడం లేదు. ఇప్పటివరకు ఏ నాయకుడు సహకార అందించలేరు. నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలందరికీ పెండ్లిల్లు చేశాం. ఇంకా కిరాయి ఇండ్లల్లోను ఉంటున్నాం. ఇప్పుడు ఎర్రజెండ వాళ్లతో కలిసి పోరాటం చేస్తున్నాం.

పూటగడవడమే కష్టం



రాధిక. నెహ్రూనగర్

మేము చాలా చిన్న కుటుంబం. పనిచేసుకుంటే గాని పూటగడవని పరిస్థితిలో ఉన్నాం. అటువంటిది కిరాయిలు కట్టుకుంటూ కూలి చేసుకుంటూ బతకడం చాలా కష్టంగా ఉంది. ఇంట్లో ప్రతి ఒక్కరం ప్రతి ఒక్కొక్క పని చేస్తున్న మూడు వేల రూపాయల కిరాయిలకే పోతుంది. మిగతావి కుటుంబ పోషణకే సరిపోవడం లేదు. ప్రభుత్వం స్పందించిన మాకు పక్కా ఇంట్లో నిర్మించే ఇస్తే కిరాయి డబ్బులైన మిగులుతాయని అన్నారు. అందుకే ఎర్రజెండా పట్టుకున్నాం.

వేగంగా అంతరాష్ట్ర వంతెన పనులు


కొనసాగుతున్న పనులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం మంజీర నదిపై మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న నాలుగు రహదారుల వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఇంజనీర్ల పర్యవేక్షణలో నిర్మాణ రంగ కార్మికులు పనులను వేగంగా కొనసాగిస్తున్నారు. వంతెన పిల్లర్లు కొనసాగడం, పూర్తయిన పిల్లర్లపై స్లాబ్ దిమ్మెలను భారి క్రేన్‌ల సహాయంతో బిగిస్తున్నారు. మరికొందరు నిపుణులు బిగించిన దిమ్మెలపై రాడ్ల అమరిక పనులు చేపడుతున్నారు. ఈ వంతెన రహదారిని నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రహదారికి అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే బైపాస్ పనుల్లో భాగంగా పలు చోట్ల మొరం రోడ్డు పనులు పూర్తి కావచ్చింది. వచ్చే ఏడాది జూన్ వరకు పూర్తి చేయాల్సి ఉంది.



హింసకు వ్యతిరేకంగా

మహిళా లోకం ఏకం కావాలి

- పోరాటాలతోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్
- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని లత పిలుపు
- ఐద్వా కామారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

మహిళలపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర సహయ కార్యదర్శి సబ్బని లత పిలుపు నిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఐద్వా కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్బని లత మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసోద్మాదానికి వ్యతిరే కంగా ఉద్యమాలకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహిళామణులు ఆకాశంలో సగం అవనిలో సగమైన స్థితికి ఎదుగుతున్నారని ఆమె గుర్తు చేశారు. అదేవిధంగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరే కంగా సమాజ మంతా ఏకం కావాలని అన్నారు. అదేవిధంగా నూతన సంవత్సరం సందర్భంగా మోడీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను కల్పించేంత వరకు ఉద్యమాలకు నడుము కట్టాలని అన్నారు. అదేవిధంగా మహిళల రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళ హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున సబ్బని లత

ఐద్వా కామారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం ఐద్వా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎడ్ల శ్రీలత, జిల్లా కార్యదర్శిగా రాజారాం సావిత్రి, ఉపాధ్యక్షులుగా మంజుల, సహాయ కార్యదర్శిగా స్వప్న, ధనేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, అనసూయ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభం

- నవతెలంగాణలో కథనంతో కదలిక


నవతెలంగాణలో ప్రచురితమైన కథనంతో పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండ లంలోని పడంపల్లి చౌరస్తా వద్ద అర్ధాంతరంగా నిలిచి పోయిన బస్టాండ్ నిర్మాణ పనులను ఎట్టకేలకు ఆదివారం ప్రారంభించారు. శనివారం నవతెలంగాణ తెలుగు దినపత్రికలో ప్రచురితమైన "ప్రయాణికులకు పాట్లు" వార్తకు రూర్బన్ మేనేజర్ వినోద్ స్పందించారు. వెంటనే పనులను ప్రారంభించి బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించడంతో గుత్తెదారు ఆదివారం పనులు ప్రారంభించారు. పనులు సకాలంలో పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులో తెస్తామని తెలిపారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గిరిజన రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రకాష్ నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర గిరిజన మహాసభ వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని అన్ని తండాల గిరిజన నాయకులు మార్చి 1వ తేదీనా మిర్యాలగూడలో జరిగే రాష్ట్ర మహాసభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమరం తండా సర్పంచ్ కిషన్‌నాయక్, పరశురాం నాయక్, రవీందర్ నాయక్, ప్రేమ్‌సింగ్ నాయక్, మూతిరామ్ నాయక్, వివిధ తండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పస్తులతోనే పారిశుధ్య పనులు

- జీపీ, మున్సిపల్ కార్మికులకు అందని వేతనాలు
- మూడు నాలుగు నెలలుగా పెండింగ్

నవతెలంగాణ-రామారెడ్డి




సమాజానికి శుభ్రతను అందించేందుకు వారు చేమటోడుస్తారు. వారు మురికిగా మారి స్వచ్ఛతను అందజేస్తారు. వారి రెక్కల కష్టం లేని నాడు, లోకమంతా మురికి వాసననే. వారు సమ్మె చేస్తే దుమ్ముతో, దుర్వాసనతో, ఊరువాడ దుర్గంధం వెదజల్లుతది. పారిశుధ్య కార్మికులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. వారి రెక్కల కష్టం వెలకట్టలేనిది. అలాంటి రెక్కల కష్టానికి ప్రతిఫలం అందక పస్తులతో పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. పూట గడవని పరిస్థితుల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న వారికి.. సకాలంలో వేతనాలు అందకపోవడంతో పస్తులుండాల్సి పరిస్థితి నెలకొంది.

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో 19 గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు దాదాపు 120 మంది ఉన్నారు. పారిశుద్ధ్య కార్మికులు అసలే చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారు. అయినా గత డిసెంబర్ నెల నుండి ఇప్పటివరకు వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం లేచిన నుండి చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత, డ్రైనేజీల శుభ్రత, వంటి పనులతో పొద్దస్తమానం కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందించకపోవడంపై పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల నుండి పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను చెక్కుల రూపంలో ఎస్‌టివోలో అందజేసినా, దాదాపు రెండు నెలలు ప్రభుత్వం ఫ్రీజింగ్ పెట్టడంతో పారిశుద్ధ్య కార్మికులకు సరైన సమయానికి వేతనాలు అందక అల్లాడుతున్నారు. ప్రతి నెల వేతనాలు అందించి పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పనులు నిలిచిపోయాయి

గీ రెడ్డి మహేందర్ రెడ్డి. పోసానిపేట్ సర్పంచ్.



రెండు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడంతో, పారిశుద్ధ్య కార్మికులు పనులకు మానుకొనడంతో, గ్రామంలో రెండు నెలల నుండి పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. నూతన కార్మికులను నియమించాలంటే, వేతనాలు రావడం లేదని ఎవరు పనిలోకి రావటం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు మాత్రం వెంటనే అందించాలని డిమాండ్ చేస్తున్నాం.

పారిశుధ్య సిబ్బంది, కార్మికులు బిక్షాటన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), కారోబార్ యునియన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. కారోబార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ కార్మికులకు, కారోబార్లకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని దీనితో వాళ్ళ కుటుంబాలు పూటగడవక చాలా ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులకు అందరికీ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని జీవో నంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు 26వేల రూపాయలు ఇవ్వాలని గ్రామ పంచాయతీ సిబ్బంది, వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. జీవో 51 మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్లకు అసిస్టెంట్ పంచాయతీ సెక్రటరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు బాలయ్య, సాయిలు, ఇరాజ్, పూల్‌సింగ్, నాథెల్, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కార్పెంటర్ గుడిసె దగ్ధం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో గల మల్లెల సుదర్శన్ కార్పెంటర్ గుడిసెలో అగ్ని ప్రమాదం జరిగినట్టు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అగ్ని ప్రమాద సమయంలో గుడిసెలో ఎవరూ లేనందున ప్రాణాపాయం తప్పింది. గుడిసెలో గల విలువైన సామన్లు, పేపర్ మిషన్, హాండ్ కట్టర్, దూగడ మిషన్, డ్రిల్ల్ మిషన్, రుటర్ మిషన్, చైన్ మిషన్, సంగడి మిషన్, ట్రైటర్ మిషాన్‌లు, ఇతర సామగ్రి ప్లానర్ మిషిన్లు వివిధ రకాలైన పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి.

మున్నూర్ కాపు సంఘానికి రూ.50 లక్షలు మంజూరు

నవతెలంగాణ-మాక్లూర్

మండల మున్నూర్ కాపు సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.50 లక్షలు మంజూరు అయినట్టు జీవనన్న యువజన అధ్యక్షులు గోపు రంజిత్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పెద్దలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం పెద్దలు

మిత్తికి మిత్తి



లింగంపేట్ సహకార సంఘం

- సహకార రైతుకు తిప్పలు
- తడిసి మోపెడవుతున్న అప్పులు
- ఏడేండ్లుగా అందని వడ్డీ రాయితీ
- వడ్డీ చెల్లించాలని రైతులకు నోటీసులు

సహకార సంఘంలో రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలకు వడ్డీ రాయితీలు చెల్లించకపోవడంతో.. వడ్డీకి చక్రవడ్డి తోడవుతోంది. దీంతో మిత్తికి మిత్తి పెరుగుతూ రైతులపై అదనపు భారం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ఏడేండ్లుగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతుంది. తాజాగా మిత్తి డబ్బులు చెల్లించాలని సహకార సంఘాల నుంచి రైతులకు నోటీసులు వెళ్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లాలో 55 సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో ఒక లక్ష 432 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. 15 వేలకు పైగా మంది రైతులు సంఘాల ద్వారా పంట రుణాలు, గేదెలు, గొర్రెలు, కోళ్ల ఫారాలు, ట్రాక్టర్ ఇతరాత్ర అవసరాల కోసం దీర్ఘకాలిక రుణాలు సైతం తీసుకున్నారు. 2014-15వ సంవత్సరవంలో జిల్లా వ్యాప్తంగా రైతులు రూ.25 కోట్లకు పైగా రుణాలు తీసుకోగా.. మొదటి సంవత్సర వడ్డీ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించింది. తర్వాత నుంచి వడ్డీ చెల్లించడం మరిచింది. అయితే 2016 సంవత్సరం నుండి 2023 వరకు ఏడు సంవత్సరాలుగా వడ్డీ చెల్లించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందనే ఆశతో రైతులు అసలు కట్టి వడ్డిని కట్టకుండా వదిలేశారు. దీంతో ఏడేండ్ల కాలంలో వడ్డీకి చక్రవడ్డి కలపడంతో రూ.8 కోట్లకు పైగా రైతులు బకాయి పడ్డారు.

మిత్తికి మిత్తి.. రైతుకు తిప్పలు

సహకార సంఘం ద్వారా రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. గడువులోగా కడితే వడ్డీ వస్తుందని చెప్పడంతో రైతులు ప్రయివేటు వ్యాపారుల వద్ద అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చి కట్టారు. సహకార సంఘం సిబ్బంది సైతం అసలు చెల్లించండి వడ్డీ వస్తుందని ప్రచారం చేయడంతో రైతులు అప్పొసప్పొ చేసి చెల్లించారు. రుణాలు చెల్లించి ఏడేండ్లు గడుస్తున్నా వడ్డీ ఇప్పటి వరకు చెల్లించకపోవడం గమనార్హం. ప్రస్తుతం మిత్తికి మిత్తి పేరుకుపోయి తడిసి మోపిడైంది. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి యాసంగిలో పంటలు సాగుచేసిన రైతులకు వడ్డీ రాయితీ మిత్తికి మిత్తి నోటీసులు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు పంటకు తెగులు మరోవైపు విద్యుత్ కోతలు ఇంకోవైపు భూగర్భ జలాలు అడుగంటడం బోర్లెత్తిపోవడంతో రైతులు తిప్పలు పడుతున్న తరుణంలో సహకార సంఘం అధికారులు వడ్డీ చెల్లించాలని, మిత్తికి మిత్తి చెల్లించాలని నోటీసులు జారీ చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 3,700 మంది సభ్యులకు గాను 276 మంది రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. వారికి వడ్డీ రాయితీ కోటి రూపాయల వరకు రావాల్సి ఉంది. నల్లమడుగు ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 1920 సభ్యులకు గాను 204 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. వీరికి రూ.78 లక్షల వడ్డీ రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ చెల్లించకపోవడంతో నోటీసులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న అధికార పార్టీ పాలకులు.. వెంటనే తమ గోడు పరిష్కరించాలని కోరుతున్నారు.

మిత్తికి మిత్తి అయింది



2016లో రూ.2.50 లక్షల దీర్ఘకాలిక రుణం తీసుకున్నా. కిస్తీలుగా మొత్తం రుణం చెల్లించా. రూ.2000 మిత్తి అయితే.. రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేస్తదని సహకార సంఘం సిబ్బంది చెబితే చెల్లించలేము. ఆ 2000 రూపాయల వడ్డికి ఏండేండ్లకు వడ్డి మీద చక్రవడ్డి, అపరాద వడ్డీ పేరుతో రూ.18,000 అయినట్టు నోటీసు వచ్చింది. మిత్త వస్తదని అసలు కడితే.. మిత్తికి మిత్తి పెరిగింది. అప్పుడే కడతామంటే అధికారులు వద్దన్నారు. ఇప్పుడు ఎక్కడి నుంచి తేవాలి..?

– రాజు. పరమళ్ళ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని గోప్యా తాండ పరిధిలోగల గంట తండాలో ఐదు లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులను స్థానిక జడ్పీటీసీ మాలావత్ మాన్సింగ్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ రామచందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జడ్పీటీసీ, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్‌కు రుణపడి ఉంటామని తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తండాలను జీపీలుగా మార్చి, గిరిజనులకు అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శంకర్ ,దేశ్యా, లింగం తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విద్యార్థులు



విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థులు ఆదివారం ఉదయం విహారయాత్రకు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను పాఠశాల విద్యార్థులు సందర్శించినట్టు ప్రిన్సిపాల్ చంద్రవిలాష్, కరస్పాండెంట్ రత్నాకర్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు విహారయాత్రలో భాగంగా పలు ప్రాంతాలను పరిచయం చేయడం ద్వారా సమాజంపై అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాష్, కరస్పాండెంట్ రత్నాకర్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో పది విద్యార్థులకు వీడ్కోలు



డ్యాన్సులతో అలరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని గాంధీనగర్ శివారులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం రాత్రి పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దేవరాజ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థిని, విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో చదువుకొని ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని అన్నారు. ప్రతి ఒక్క సబ్జెక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలని, చదువే లక్ష్యంగా పెట్టుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. పాఠశాల పరిపాలన అధికారిని పద్మ మాట్లాడుతూ.. నేడు ఎందరెందరో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రముఖులు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకొని పైకి వచ్చినారని, నిర్దిష్ట లక్ష్యంతో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలపై 20 నిమిషాల్లో రుణం

నవతెలంగాణ-సిరికొండ

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 20 నిమిషాలలో బంగారు ఆభరణములపైన రుణం ఇవ్వబడుతుందని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 లక్షల రుణం ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా ఇవ్వబడునని, ఎటువంటి ప్రీ పేమెంట్ చార్జీలు లేవని, గరిష్టంగా 50లక్షల వరకు రుణం ఇవ్వబడునని పేర్కొన్నారు. అకౌంట్ లేని వారికి తక్షణమే అకౌంట్ తెరిచి రుణం ఇవ్వబడునని, అన్ని పనిదినాల్లో బ్యాంకింగ్ సమయంలో తక్షణ రుణం ఇవ్వబడునని, రైతులకు వడ్డీ రేట్లపై రాయితీ సదుపాయం కలదని మరిన్ని వివరాలకు దగ్గరలోని బ్రాంచీలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో 201 మంది గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ ప్రాక్టికల్ మూడవ స్పెల్ ఆదివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 201 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజు తెలిపారు. ఉదయం 40 మంది జనరల్ విద్యార్థులు, ఒకేషనల్ 44 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, మధ్యాహ్నం జనరల్ 57, ఒకేషనల్ 60 మంది గైర్హాజరయ్యారని అన్నారు. జనరల్ విద్యార్థులు ఉదయం 1424 మందికి 1384 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 455 మంది విద్యార్థులకు 411 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్ 951 మంది విద్యార్థులకు 894మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 376మంది విద్యార్థులకు 316 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా జిల్లా ఇంటర్ విద్య అధికారి 6 పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి, హై పవర్ కమిటీ రాజీయుదిన్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం

- బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్.సిద్ధిరాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ ఒకటి నుంచి 1000 బీడీలకు 22 రూపాయలు బీడీ యాజమాన్యం కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బీఎల్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బీఎల్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్ధిరాములు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెరిగిన కరువు భత్యం (వీడీఏ) బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికులకు చెల్లించకుంటే వారిపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, శంకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి అండగా ఉంటా

- ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- బాలుడు కుటుంబానికి లక్ష రూపాయలు అందజేత..



బాలుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గతవారం హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన ప్రదీప్ అనే బాలుడి కుటుంబానికి అండగా ఉంటానని ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బాలుడి స్వగ్రామం ఇందల్‌వాయిలో బాలుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం పరామర్శించారు. బతుకు తెరువు కోసం ఊరు వదిలి హైదరాబాద్‌లో జీవిస్తున్న గంగాధర్ కుటుంబానికి ఇలా జరగడం బాధాకరమన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆదుకునే విధంగా కృషి చేస్తానని వెల్లడించారు. ఆ కుటుంబానికి భరోసా కల్పించేందుకు తనవంతు సహాయంగా రూ.లక్ష నగదును అందజేశారు. వీధి కుక్కల కట్టడి కోసం ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి బాలుడి కుటుంబానికి మరింతగా అండగా నిలుస్తామని వెల్లడించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలలో వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించారు. తిర్మన్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, సిర్నాపల్లి ఎంపీటీసీ కచ్చుకాయల అశ్విని శ్రీనివాస్‌ను, గన్నారం మాజీ ఎంపీటీసీ గుండా శ్రీనివాస్, చంద్రాయన్‌పల్లి చెవుల రాములు కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, జడ్పీటీసీ సుమనా రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బుసని అంజయ్య, మండలాధ్యక్షులు చిలివేరి దాసు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాశంకుమార్, సర్పంచ్ నోముల విజయ లక్ష్మారెడ్డి, కార్యదర్శి పులి శ్రీనివాస్, మహిళ విభాగం పులి వసంత, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ సభ్యుల కుటుంబాలకు 'బీమా' భరోసా..

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అజ్రత్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును కుటుంబ సభ్యులకు ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యుడి కుటుంబానికి 'నేనున్నా'నంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసాగా నిలిచి వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. దీనివల్ల ఆ కుటుంబాలకు ఎంతో కొంత పార్టీ ద్వారా ఆర్థికసాయం అందుతుందన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్నీ రాష్ట్రంలో ప్రజల ముంగిటకు తీసుకెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అన్నారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, జడ్పీటీసీ సుమన రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బుసని అంజయ్య, మండలాధ్యక్షులు చిలివేరి దాసు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాశంకుమార్, పులి శ్రీనివాస్, సర్పంచ్ నోముల విజయ లక్ష్మి లక్ష్మారెడ్డి, మహిళ విభాగం పులి వసంత, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

భూలక్ష్మి క్యాంప్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని భూలక్ష్మి క్యాంప్ గ్రామంలో సర్పంచ్ బెజ్జం వెంకట్‌రెడ్డి సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధుల ద్వారా మంజూరైన రూ.7.5 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించి సీసీ రోడ్ల నిర్మాణపు పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దవర్ గంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్, ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, భానుప్రకాష్, గ్రామ పెద్దలు గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీఓడబ్ల్యూ నాయకులు అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పుట్ట లక్ష్మీ మాట్లాడుతూ.. మహిళాభివృద్ధిని దెబ్బతీస్తూ స్త్రీ-పురుష అసమానత్వాన్ని పెంచి పోషించే పితృస్వామిక పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపు ఇచ్చారు. 113సంవత్సరాల క్రితం ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులు 14నుంచి 18 గంటలు వెట్టి చాకిరి చేయించుకునే వారని వివక్షత, అసమానతలకు, అణచివేతకు వ్యతిరేకంగా, సమానవేతనం కోసం మహిళలు పోరాడారని గుర్తు చేశారు. వారి పోరాటం ఫలితంగా 1909లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళలు పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు దాటిన మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు కాకపోవడం సిగ్గు చేటన్నారు. నేటికి సమాజంలో మహిళలపట్ల వివక్షత, అణచివేత, అసమానతలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అనేక రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని తెలియచేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు అనిత, నిఖిల, పద్మ, అబ్బవ్వ గంగవ్వ, లావణ్య పాల్గొన్నారు.

మోడీ అబద్ధాలకు డాడీ

- అంబానీ, ఆదానీలకు భారీ అమౌంట్లు
- టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అబద్దాలకు డాడీ అని, ఆయన మాటలు కోటలు దాటినా చేతలు ఢిల్లీ గడప దాటవని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని మాక్లూర్ మండలానికి చెందిన వందలాది మంది యువకులు బంజరాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో వారు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీజేపీని వీడి ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు వేసి వారిని బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించిన జీవన్‌రెడ్డి పార్టీలో వారికి సముచిత స్థానం, రెట్టింపు గౌరవం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను బీసీలు, రైతుల సంక్షేమ పార్టీగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ దిక్కుదివాణం లేని పార్టీ అని బీజేపీకి అంత సీన్ లేదని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ అంటేనే బడా జూటా పార్టీ అని, ఒక్క ఎన్నికల హామీని కూడా నిలబెట్టుకోలేదని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా విదేశాల్లో మూలుగుతున్న నల్ల ధనాన్ని రప్పించి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాలు ఓపెన్ చేయించారని, చివరకు జనానికి ఖాళీ అకౌంట్లు మిగలగా.. అంబానీ, ఆదానీల ఇండ్లకు భారీగా ధనం చేరుతున్నదని ఆయన నిప్పులు చెరిగారు. విదేశాల నుంచి నల్లధనం తేకపోగా దేశంలోని మూలాధనాన్నే అమ్మేస్తున్నారని విమర్శించారు. మోడీ ఎప్పుడూ అబద్ధం తప్ప నిజం పలకరన్నారు. ఏడాదికి 2కోట్ల చొప్పున ఉద్యోగాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా ఉన్న కొలువులనే పీకేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఢిల్లీలో నరేంద్ర మోడీ.. నిజామాబాద్‌లో అరవింద్ కేడీ అంటూ మండిపడిన జీవన్‌రెడ్డి నిజామాబాద్ కేడీ ఎంపీ అరవింద్ కూడా గెలిచిన వెంటనే పసుపు బోర్డు తెస్తానని చెప్పి మాట తప్పడం ద్వారా రైతులకు కుచ్చుటోపీ పెట్టారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకులు కంఠం అభిలాష్, జాద్ సురేష్, చిన్న రమేష్, శ్రీకాంత్, రజినికాంత్, రాము, గుంజిలి రంజిత్, మహేందర్, సర్పంచులు చిన్నారెడ్డి, ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ గాల్వే గంగాధర్, సీనియర్ నేత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-పిట్లం

పిట్లం ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మంత్రి సురేష్ (నమస్తే తెలంగాణ), ఉపాధ్యక్షులుగా పాముగాని పామయ్య (నవతెలంగాణ), కార్యదర్శిగా ముఖీద్ (ప్రజా దర్బార్), కోశాధికారిగా ఖలీమ్ (సియాసత్)ను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తాగౌడ్, రాజ్ మల్లయ్య , శేఖర్ , సలీం , రామకృష్ణ , కృష్ణారెడ్డి , వెంకట్ , ప్రసాద్ , సంతోష్ , శ్రీహరి , షబ్బీర్ , ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

బర్కత్‌పురలోని రోటరీ కార్యాలయంలో రోటరీ అంతర్జాతీయ 118వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు అధ్యక్షులు సతీష్ షాహ తెలిపారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల మాట్లాడుతూ.. అంతర్జాతీయ రోటరీ పోలియోను నిర్మించే తన తదుపరి లక్ష్యంగా అక్షరాస్యత వైపున పయనిస్తుందని ఇంతే కాకుండా మహిళా శిశువు ఆరోగ్యం, పరిశుభ్రత, శాంతి, పర్యావరణం వంటి వాటిలో కూడా తమ సేవలను కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ కోశాధికారి డాక్టర్ హరి స్వామి, సభ్యులు ఎ.రాజేందర్, పార్సిరాజేశ్వర్, ఆకుల అశోక్, రాజ్‌కుమార్ సుబేదార్, వి.శ్రీనివాసరావు, జితేంద్రమాలాని, శ్రీరామ్ సోనీ, జ్ఞాన ప్రకాష్, ధంపల్ శ్రీనివాస్, జుగల్ సోని, బాబురావ్, డాక్టర్ నవీన్ మాలు తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ



అద్దాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్, అయ్యపల్లి, నల్లమడుగు గ్రామాల్లో అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఇటీవల నిర్వహించిన కంటివైద్య శిబిరంలో అవసరమున్న వారిని గుర్తించి అద్దాలు అందజేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నల్లమడుగు షరీఫ్ తెలిపారు. కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంటి అద్దాలు అందించిన మదన్ మోహన్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి సాజిద్, బాలకిషన్, అర్షద్ పాషా, రాజు, సిద్దు మహేష్, రవి, ఇర్ఫాన్, శివాజీ, సాయిలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా చేపట్టినటువంటి పనులు.. ఏయే గ్రామాల్లో ఎన్ని పనులు చేపట్టారు.. ఎంత ఖర్చు పెట్టారో ప్రజావేదిక నివేదికలో వెల్లడించనున్నట్టు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, హాజరు కావాలని సూచించారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో ఆదివారం యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డి పేటకు చెందిన శెట్టిపల్లి రాజశేఖర్ (26) టాటా ఏసీ వాహన ఇన్సూరెన్స్ డబ్బులు కట్టాలని, తల్లిని బంగారం అమ్మి డబ్బులు ఇవ్వాలని అడగగా.. తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో బూతులు తిడుతూ, చితకబాది, ఉదయం 9 గంటలకు దామర చెరువు సమీపంలోని గల చేనులో క్షణికావేశంలో నైలాన్ తాడుతో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శెట్టిపల్లి లక్ష్మీ నరసవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో అవుకు గాయాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ని 12 వ వార్డులోని సిరి గోశాలలో అవుపై కుక్కలు దాడి చేశాయి. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటితో పశువులకు, మనుషులకు ప్రాణాపాయం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఇక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

న్యాయవాది గటాడి ఆనంద్

నవతెలంగాణ-ఆర్మూర్

సమాచార హక్కు చట్టం వజ్రాయుధమని న్యాయవాది గటాడి ఆనంద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నుంచి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో తమకు కావాల్సిన సమాచారం ఎలా రాబట్టుకోవాలో క్లుప్తంగా వివరించారు. ఈ చట్టంపై సాధించిన విజయాలు సూచించారు. దేశవ్యాప్తంగా పట్టిపీడిస్తున్న అవినీతిని అంతం చేసేందుకు సమాచార హక్కు చట్టం ఆయుధం లాంటిదని, అవినీతిని బయట పెట్టేందుకు ఈ చట్టం కింద పూర్తి వివరాలు కోరుతూ ఆయా శాఖలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జీవించే హక్కుకు భంగం కలిగిన సందర్భాల్లో 48 గంటలు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా దరఖాస్తుదారునికి తప్పుడు సమాచారం ఇచ్చిన అసంపూర్తి సమాచారం ఇచ్చినా.. వారికి రాష్ట్ర కమిషన్‌కు రోజుకు 250 నుంచి రూ.25వేల వరకు జరిమానా విధించే అధికారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ జైశీల, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహనా సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ అల్జాపూర్ రాజేశ్వర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు సంయుక్తంగా మండలంలోని చేపూర్ గ్రామ శివారు క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత విద్య-దిశ నిర్దేశాలు అవగాహనా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీచర్స్ ట్రైనర్ మోటివేషనల్ స్పీకర్ రాచకొండ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ పరీక్షల ప్రణాళిక పట్ల అవగాహన విజయం సాధించడానికై పాటించవలసిన మెలకువలపై పూర్తి అవగాహన కల్పించారు. ప్రముఖ కెరీర్ గైడెన్స్ వ్యాఖ్యాత వంగ శ్రీహరి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అనేది మొదటి మలుపు అని, తర్వాత ఎంచుకునే కోర్సులు కెరీర్ ఓరియంటెడ్‌గా ఉండాలని, వాటిని ఎంచుకునే గమనంలో పాటించవలసిన వాటిని ఎవరికి వారు గుర్తించి ఆ కెరీర్లో ఎలా సఫలీకృతం కావచ్చో సవివరంగా వివరించారు. అనంతరం సొసైటీల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో నిబద్ధతను అలవర్చుకుని పట్టుదలతో మంచి కెరీర్‌లో స్థిరపడాలని, భారతదేశాన్ని గురుస్థానంలో నిలిపే దిశలో మనమందరం పాటుపడాలని తెలిపారు. సదస్సులో కోశాధికారి గంగాధర్, క్షత్రియ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బండారి నరేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో అంగన్‌వాడీల మూసివేతకు కుట్ర

- ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే యత్నం
- మార్చి 1,2,3 అంగన్‌వాడీల సమ్మె
- జయప్రదం చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు సురేశ్ గొండ

మార్చి 1, 2, 3వ తేదీల్లో అంగన్‌వాడీల సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు సురేశ్‌గొండ పిలుపునిచ్చారు. ఆదివార జిల్లా కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా చట్టం వల్ల క్రమంగా అంగన్‌వాడీ సెంటర్లను ఎత్తివేసే ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యపరచాలని చేస్తున్నదని, అందులో భాగంగానే కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిధులు తగ్గించిందని అన్నారు. ఐసిడియస్ వ్యవస్థను పటిష్ట పరచాలని, ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న ఐసీడీఎస్‌ను కాపాడాలని, గర్భిణీలకు బాలింతలకు చిన్న పిల్లలకు పోషకాహార లోపంతో ఉన్న మహిళలకు రకరకాల సేవలు అందిస్తున్న అంగన్వాడీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్‌లకు పిఎఫ్ ఈఎస్‌ఐ, గ్రాడ్యూటీ, పెన్షన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాబాయ్ మాట్లాడుతూ ఎన్నో రకాల సేవలు ప్రజలకు అందిస్తున్న ఐసీడీఎస్‌ను క్రమంగా నిర్వీర్యపరచడానికి ప్రభుత్వాలు పూనుకున్నాయని ఐసిడిఎస్ ను పటిష్టంగా అభివృద్ధి పరచాలని, అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లకు భద్రత కల్పించాలని, మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా గుర్తించాలని కోరారు. మినీ అంగన్వాడి సెంటర్లకు హెల్పర్లను కేటాయించాలని, పెండింగ్‌లో గల టిఏడిఏలు చెల్లించాలని, సంవత్సరానికి ఇచ్చే రెండు జతల బటల్లో కోత విధించొద్దని కోరారు. బకాయి డ్రస్సులు ఇవ్వాలని, ఇంటి అద్దెలు, గ్యాస్ , సిలిండర్లు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వ్యవస్థను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు పట్టణాల్లో గ్రామాల్లో విస్తృత సేవలు అందిస్తున్న అంగన్వాడి వ్యవస్థను పటిష్ట పరచాలని .ప్రభుత్వంలోనే కొనసాగించాలని ఆమె కోరారు. పని ఒత్తిడి తగ్గించాలని, సంబంధం లేని పనులు అంగన్వాడీలకు చెప్పరాదని, అంగన్వాడీ వ్యవస్థను పటిష్ట పరిచే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనసూయ, దేవకర్ణ, మంజుల, జిల్లా కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

మార్చి ఒకటో తేదీ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నాలు ప్రదర్శన నిర్వహించాలని, మార్చి రెండున జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తలో వంటావార్పు నిద్రించే కార్యక్రమం ఉందని, మార్చి మూడవ తేదీనా తెలంగాణ చౌరస్త నుంచి నూతన కలెక్టర్ వరకు పాదయాత్ర వినతిపత్రం ధర్నా ఉంటుందని వారు తెలిపారు.

తెల్లజొన్న కళకళ

- తక్కువ ఖర్చు.. ఎక్కువ దిగుబడి

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల వాసులకు పెద్దజొన్న అన్నది ప్రధాన ఆహారం. మండల ప్రజలకు జొన్న రొట్టే లేనిదే ఆహారం పోదు, కడుపు నిండదు. పూర్వీకుల నుండి ప్రధాన ఆహారంగా వినియోగంలో ఉంది. జొన్న రొట్టే అనేక పోషక విలువలతో కూడిన ఆహారం కావడంతో ప్రస్తుతం జొన్నలను పట్టణాలలో కూడా విరివిరిగా వంటకాలలో ఆహారంగా ఉపయోగిస్తున్నారు.

మండలంలో వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం 39 వేల ఎకరాలు సాగుకు అనువైన భూమి ఉంది. ప్రస్తుతం తెల్లపజొన్న పంట 900 ఎకరాలలో సాగు చేస్తున్నారు. గతేడాది కంటే పంట విస్తీర్ణం పెరిగింది. ఎకరాకు పది క్వింటాళ్లపైనే దిగుబడి వస్తుంది.



50 రోజుల పంట

లాభదాయకమైన పంట

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందే పంట తెల్ల జొన్న పేరు గాంచింది. ప్రస్తుతం మ్యాట్‌లో క్వింటాల్ ధర నాలుగువేల పైచిలుకు పలుకుతుంది. జొన్న సొప్ప పశువులకు మేతగా ఉపయోగ పడుతుంది. దీంతో పాటు పంటకు చీడ పురుగుల బెడద తక్కువగా ఉంటుంది. నీటి వసతి ఉంటే పదికి బదులు పదిహేను క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుంది. కాగా అడవి పందులతో పంటకు నష్టం వాటిల్లుతుంది. పందులు దాడి చేసి రసం పీల్చి పంటను తొక్కేస్తుండటంతో నష్టం వాటిల్లుతుందన రైతులు పేర్కొంటున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- మరో ఇంట్లో చోరీకియత్నం

నవతెలంగాణ-రామారెడ్డి

తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డాడు. దీంతో పాటు మరో ఇంట్లో సైతం చోరీకి యత్నించారు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని మద్దికుంట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన ఒరగంటి స్వప్న ఇంటికి తాళం వేసి, పని నిమిత్తం కామారెడ్డి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఐదు గ్రాముల బంగారు ఆభరణాలను చోరీకి గురైయ్యాయి. రేకులపల్లి ఆదిరెడ్డి ఇంట్లో చోరీకి, ఇంటి సెల్పులకు కన్నం వేస్తుండగా, ఇంట్లో వారు కేకలు వేయడంతో దుండగులు పారిపోయినట్టు పోలీసులు తెలిపారు. స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అనుమానిత వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అ'పూర్వ' సమ్మేళనం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో 1984-85, 1985-87 పదవ తరగతి, ఇంటర్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చిన్నానాటి తీపి గుర్తులను నెమరవేసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తరువాత కలుసుకోవటం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది అన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగ, వ్యాపారాల విషయాలను పంచుకున్నారు.



గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామ శివారులో ఉన్న గంగమ్మ ఆలయంలో గ్రామ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గణపతి పూజ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గంగపుత్రులు తమ కుల వృత్తిని చాటేలా గ్రామంలో చేపలు పట్టే వలతో అమ్మవారిని డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. కాగా సోమవారం గంగమ్మ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, గంగపుత్రులు తెలిపారు. విప్ గంప గోవర్ధన్ తనయుడు శశాంక్ హాజరవుతారని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు.

భవానిపేట్‌లో పెద్దమ్మ బోనాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని భవానిపేట్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు వారి ఆరాధ దైవమైన పెద్దమ్మకు బోనాల తీశారు. ఈనెల 21 నుండి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రోజువారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేశారు. చివరి రోజు ఆదివారం ముదిరాజ్ కులస్తులు ఇంటింటి నుంచి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుసప్పుల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు.

డాక్రా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : పీవోడబ్ల్యూ

నవతెలంగాణ-ఆర్మూర్

డ్వాక్రా మహిళలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో కామ్రేడ్ కుమార్ నారాయణ భవన్‌లో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యవర్గ సమావేశాన్ని కామ్రేడ్ సత్యక్క అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ సాధన ఉద్యమంలో మహిళల పాత్ర ఎనలేనిదని అన్నారు. గత ప్రభుత్వాలు మహిళలకు కేవలం 25పైసల వడ్డీలకు మాత్రమే ఇచ్చాయని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడితే పది లక్షల రూపాయల వరకు వడ్డీ లేకుండా రుణాలు ఇస్తామని హామీలు ఇచ్చారని, అంతేకాకుండా అభయహస్తం స్కీం కింద సుమారుగా ఇరవై ఒక్క లక్ష మహిళా సంఘాల సభ్యుల వాటా కింద 600కోట్ల రూపాయలను ప్రభుత్వ ఖాతాకు జమచేస్తే కనీసం ప్రభుత్వ వాటా కింద మహిళా సంఘాల డబ్బు కలిపి సంఘాలకు ఇచ్చిన పాపన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యక్షురాలు పి.రమ, ఉపాధ్యక్షురాలు ఎం.సత్య మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం డివిజన్‌లో మూడో తేదీన, 4వ తేదీన గడుకోలు గ్రామంలో, కమ్మర్‌పల్లి ప్రాంతంలో జరపాలని నిర్ణయించుకున్నామని అన్నారు. సమావేశంలో మరో ఉపాధ్యక్షులు పద్మ, సహాయ కార్యదర్శి పుష్పలత, జిల్లా నాయకులు నర్సక్క పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు దేశ వ్యాప్తంగా ఆదరణ

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరికలు



మంత్రి వేముల సమక్షంలో పలువురి బీఆర్ఎస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన, అభివృద్ధి సంక్షేమ పథకాలకు, బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీల నుంచి పలువురు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. గ్రామానికి చెందిన కొమ్ముల వెంకన్న, కొట్టాల రాజేశ్వర్, బద్దం రాజేశ్వర్, బేల్దారి సందీప్, బేల్దారి ప్రవీణ్, వంజరి గణేష్, ఏలేటి రాంచందర్, కుర్మా మహేష్ పార్టీలో చేరారు.మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు రోజురోజుకూ దేశ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా కావాలనే డిమాండ్ ప్రజల్లోంచి వస్తోందన్నారు. కేసీఆర్ నాయకత్వమే దేశానికి, రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారు శంకర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అరెల్లి నవీన్, మాజీ సర్పంచ్ రాజన్న, కొమ్ముల రాజేందర్, బట్టు అశోక్, రాజేశ్వర్, సుమన్, రజిత, మహేష్, ముత్తేన్న, తోట శ్రీధర్ పాల్గొన్నారు.

మట్టి స్నానాలతో ఆరోగ్యం



మట్టి స్నానం ఆచరించిన పలువురు ఔత్సాహికులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల ంలోని జంగంపల్లి పెద్ద చెరువు వద్ద ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన పతాంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మట్టి స్నానాలు చేశారు. ముల్తాన్ మట్టిలో వివిధ ఔషధ గుణాలు ఉన్న మూలికలను మట్టిలో కలిపి ఒంటికి పట్టించుకుని గంటపాటు యోగాసనాలు చేసి స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా యోగా గురువులు రామ్ రెడ్డి, అంకిరెడ్డి మాట్లాడుతూ మట్టి స్నానాల వల్ల అనారోగ్య సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని, స్నానాలు చేసిన అనంతరం మనుషులు ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఈశ్వర్ ,లక్ష్మీపతి ,అంజయ్య, గురుచరణ్, రఘుకుమార్, వెంకట్ స్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపులకు సూచిక బోర్డులు కరువు

నవతెలంగాణ-బోధన్



బోధన్ మండలం హంగార్గా గ్రామం నుంచి కొప్పర్గా వరకు, కొప్పర్గా నుంచి చిన్నమావంది వరకు నూతనంగా వేసిన బీటీ రోడ్డుకు సూచిక బోర్డులు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి అధికారులు రహదారులను అందంగా వేసిన వాటికి సంబంధించిన మూలమలుపులను సూచించే బోర్డులు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దాంతో ఈ మూలముల వద్ద తప్పనిసరిగా రేడియంతో చేసిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
4
సోమవారం 27 ఫిబ్రవరి 2023

శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకు



నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని పెంటఖుర్ధు క్యాంపు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండడంతో విద్యార్థులు నీటి ట్యాంకు వద్దకు చేరి ఆడుకుంటున్నారు. దాంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకు చుట్టూ ఫెన్సింగ్ కానీ, ట్యాంకును తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- గురువులకు సన్మానం



నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1977-78 సంవత్సరం బ్యాచ్‌కు సంబంధించిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఉదయం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

మొక్కవోని దీక్షతో భూ పోరాటం

- బంగారు తెలంగాణలో తలదాచుకునేందుకు ఇంటి స్థలం లేదు : నాయకుల విమర్శ
- సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మూడో రోజుకు చేరిన పోరు



పోరాటంలో పాల్గొన్న నాయకులు, పేదలు

నవతెలంగాణ-బోధన్

పేద ప్రజలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు, భూ పంపిణీ చేపడతామని ఇచ్చిన హామీలు నెరవెర్చకపోవడంతో పేద ప్రజలకు ఎర్రజెండా అండగా నిలిచింది. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎడపల్లి మండలం నెహ్రూ నగర్‌లో మూడు రోజులుగా భూ పోరాటం కొనసాగుతోంది. ఆదివారం సైతం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెహ్రు నగర్ లో భూ పోరాటం కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడారు. ఇంటి స్థలం కోసం గత 3 రోజులుగా మొక్కవోని దీక్షతో నిర్విరామంగా భూ పోరాటం కొనసాగుతుందని అన్నారు. మండే ఎండల్లో ప్రారంభమైన భూ పోరాటం ఎండ, పగలు రాత్రి అనే తేడా లేకుండా విష పురుగుల మధ్య పిల్లా, జెల్లా, ముసలి ముతకా తరలివచ్చి భూ పోరాటంలో పాల్గొంటున్నారని అన్నారు. బంగారు తెలంగాణలో కనీసం తల దాచుకోవడానికి కనీసం ఇంటి స్థలం లేదని అన్నారు. ఇన్నేళ్లు గడుస్తున్నా ఇంటి స్థలం లేకపోవడం, ప్రభుత్వ భూములు ఉండి కూడా వారికి సకాలంలో భూమి కేటాయించి ఇండ్లు నిర్మించకపోవడం సిగ్గు చేటన్నారు.



పేదలతో మాట్లాడుతున్న పెద్దివెంకట్రాములు

పోరాడి సాధించుకున్న తెలంగాణకు అవమానకరం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వందల, వేల ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా ప్రైవేటు, కార్పోరేట్ సంస్థలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ప్రభుత్వ అనుయాయులకు, దొంగ బాబాలు, పీఠాధిపతులకు, సంపన్నులకు ప్రభుత్వ భూములను ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిందని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత వేల ఎకరాల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల పేరుతో అధికార పార్టీ అండదండలతో ప్రజాప్రతినిధులు ఆక్రమించుకున్నారని అన్నారు. వందల ఎకరాల్లో ఫామ్ హౌస్ లు నిర్మించుకున్న సంఘటనలు ఉన్నాయని, పేద ప్రజలు ఫామ్‌హౌస్‌ల కోసం భూములు అడగడం లేదన్నారు. విలాసవంతమైన ఖరీదైన భవనాల కోసం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కోకాపేటలోని ఖరీదైన భూములను అసలే అడగడం లేదన్నారు. న్యాయబద్ధంగా తమకు దక్కాల్సిన భూమి కోసం పోరాడుతున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే గతంలో ప్రకటించిన మాదిరిగా తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా భూమిలేని నిరుపేదలకు, సొంత ఇల్లు లేని కుటుంబాలు సంఖ్య ఆధారంగా భూములను కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం జీవించే హక్కు, కూడు, గూడు, ఆత్మగౌరవం నేటికీ పేదల దరి చేరకుండా ఉన్నాయని 75 ఏళ్ల భారత అమత్ మహెూత్సవాలకు ఆర్భాటాలతో ఆరాటపడుతున్న తీరు అత్యంత అవమానకరం అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మన్సూర్, ఫారుక్, గంగామణి, హమీద్, జరీనా, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎంఆర్ షీట్ మింగేసిన అభ్యర్థి

- మరో షీట్‌లో సమాధానాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రశ్నలకు తాను రాసి సమాధానాలు తప్పుగా వచ్చాయని భావించిన ఓ అభ్యర్థి తన ఓఎంఆర్ షీట్‌ను చించి మింగేసి.. ఏమీ ఎరగనట్టుగా మరో ఓఎంఆర్‌షీట్‌లో సమాధానాలు రాసిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యంలో డివిజనల్ అకౌంట్స్ రాత పరీక్ష నిర్వహించారు. నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గాం (పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెంటర్ పరీక్ష రాసేందుకు అబ్దుల్ ముఖీద్ హాజరైన అబ్దుల్ ముఖీద్.. తనకు ముందు ఇచ్చిన షీట్‌లో సమాధానాలు తప్పుగా పెట్టాడని భావించి దాన్ని చించేసి.. గైర్హాజరు అయిన మరో వ్యక్తి ఓఎంఆర్ షీట్ తీసుకొని వాటిలో సమాధానాలు బబుల్ చేస్తుండగా.. ఇన్విజిలేటర్ గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ రమేష్ ఫిర్యాదు మేరకు మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ పరీక్ష



మాట్లాడుతున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్

నవతెలంగాణ-ఆర్మూర్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డివిజన్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సిద్ధాల నాగరాజు మాట్లాడారు. అలాగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్‌బాబు, గాయత్రి జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ వంశీ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య ఆధ్వర్యంలో ఈ క్వశ్చన్ పేపర్‌ను తయారు చేశారన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఆర్మూర్ పట్టణంలో ఉన్న ప్రయివేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. ఇలాంటి ప్రతిభ పరీక్షలు ప్రతి సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన నరసయ్య (45) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. నరసయ్య టైలర్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్థాపం చెందిన ఆయన శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్ళి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు శవానికి ఆదివారం రాత్రి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

యువతకు 3 రోజుల ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం యువత కోసం ప్రత్యేకంగా నిర్వహించే యువ నాయకత్వ, సామాజిక అభివృద్ధి శిక్షణను మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు డిచ్‌పల్లిలోని ఆర్‌ఎస్‌ఈటీఐలో శిక్షణనివ్వనున్నట్టు ఉమ్మడి జిల్లా ఎన్‌వైకే యువజన అధికారిని శైలి బెల్లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ 3 రోజుల పాటు ఉంటుందని, 3రోజుల రెసిడెన్షియల్ శిక్షణలో పాల్గొనదలచిన వారికి పలు సూచనలను తెలియజేశారు. శిక్షణలో పాల్గొనే వారి వయస్సు 18 నుంచి 29 సంవత్సరాల మధ్యే ఉండాలని, యువతీయువకులు ఎవరైనా నిజామాబాద్ జిల్లాకు చెందిన వారే అయి ఉండాలని సూచించారు. శిక్షణ ప్రారంభమేయ్యే మార్చి 1వ తేదీ ఉదయం నుంచి 3వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ స్థలంలోనే ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ, వసతి, భోజనం పూర్తిగా ఉచితమని, వారికి ప్రయాణ చార్జీలు కూడా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణలో వివిధ అంశాలకు చెందిన నిష్ణాతులైన శిక్షకుల చేత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం 5గంటలలోపు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కేవలం ఎంపిక చేయబడ్డ 40మందికి మాత్రమే ఈ శిక్షణ ఉంటుందని, వివరాలకు 9100435410 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పంచ శతక ధారణ మహోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని కోమన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచ శతకధారణా మహెూత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బెజుగామ రామ మూర్తి రచించిన మధురసూక్తులు శతకం, తల్లావజల మహేశ్ బాబు రచించిన పొడుపు విడుపు, పబ్బ మురళి రచించిన మురళి శతకం, కాసర్ల నరేశ్ రావు రచించిన వానచుక్క శతకం, గంట్యాల ప్రసాద్ రచించిన ఓటరన్న శతకములను ధారణా చేశారు. 26 మంది విద్యార్థులు వరుస క్రమం తప్పకుండా 5 నీతి శతకాలలోని 540 పద్యాలు కంఠత, రాగ యక్తంగాపాడి అబ్బుర పరిచారు. ముఖ్యఅతిథిగా హాజరైన మురళిశతక కర్త పబ్బ మురళి, ప్రధానోపాధ్యాయులు నర్సయ్య శతక పఠనను పరిశీలకులుగా వ్యవహరించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు బహుమతులందజేశారు. ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాయన్న, పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు నాగుల రాజేందర్‌గౌడ్, ఉపాధ్యాయబృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊషి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత పండిట్ పవన్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మున్నాభాయ్, కోశాధికారి బాబన్న, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు గంగామోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి మోహన్‌దాస్, కోశాధికారి గంగాధర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా సలహాదారులు గంగారం నగేష్, నాగభూషన్, రాజేశ్వర్, నాగమని, దేవాసుకన్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారులెవరో..?

- పోలీసులు చర్యలు తీసుకోవాలి
- ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న సునీల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి సరఫరా చేసే రవాణాదారులు అసలు ఎవరని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలువురికి ఆదర్శంగా ఉన్న బాల్కొండ నియోజకవర్గం ప్రస్తుతం గంజాయి కేంద్రంగా మారిందని అన్నారు. గత కొన్ని రోజుల క్రితం ముప్కాల్ మండల కేంద్రంలో ఇద్దరు అధికార పార్టీ నాయకుల మధ్య జరిగిన గొడవ ఇప్పుడు వారి పిల్లలపై గంజాయి కేసులో ఇరికించడం అక్రమమని అన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి బాల్కొండ నియోజకవర్గంలో కొనసాగుతున్న అక్రమ గంజాయి రవాణాపై చర్యలు తీసుకోవాలని పదే పదే కోరినా అధికార యంత్రాంగం గానీ, పోలీసులు గానీ నామమాత్రపు చర్యలు చేపట్టడం నియోజకవర్గంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా కొనసాగడం జరుగుతుందని అన్నారు. మంత్రికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై గంజాయి కేసులు బనాయించడం పోలీసులకు అలవాటైపోయిందని అన్నారు. ప్రతిపక్ష నాయకులపై గంజాయి కేసులు కాకుండా, నియోజకవర్గంలో అసలు గంజాయి రవాణా దారులపై చర్యలు తీసుకొని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గంజాయి రవాణాతో యువత పూర్తిగా చెడు వ్యసనాలకు అలవాటు పడిపోతుందని అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో యువతను గంజాయికి బలి చేయకూడదని అన్నారు.

కమ్మర్‌పల్లిలో మెగా వైద్య శిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఆర్మూర్‌లోని ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో గ్రామ పంచాయతీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ గడ్డం స్వామి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఆశ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు, గుండె వైద్య నిపుణులు, స్త్రీ వైద్య నిపుణులు, నరాల వ్యాధి నిపుణులు, గ్యాస్ట్రో వైద్య నిపుణులు, ఎముకలు, దంత వైద్యులు సేవలందిస్తూ రోగులను పరీక్షించారు. ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు, డయాబెటిస్ పరీక్షలు, చెవి ముక్కు, గొంతు, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు డాక్టర్ బాల్‌రెడ్డి, సహచర వైద్య బృందానికి కమ్మర్‌పల్లి గ్రామస్తుల తరఫున సర్పంచ్ స్వామి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుతో

5లక్షల వరకు ఉచిత వైద్యం

- తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే
- మార్చి 31 వరకు కొనసాగనున్న నమోదు ప్రక్రియ

Ayushman Bharat

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆరోగ్యశ్రీ తరహాలో కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో దారిద్ర్య రేఖకు దిగువగా ఉన్న కుటుంబాలకు ఉచితంగా వైద్యం అందించే విధంగా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తుంది. దేశ వ్యాప్తంగా ఎక్కడికి వెళ్ళినా ఈ ఆయుష్మాన్ భారత్ కార్డు పనిచేస్తుంది. ఇందుకోసం లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఈ కేవైసీ చేయాలని అధికారులు ఆదేశించారు. దీనితో జిల్లా వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుల వివరాలను ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న సీ.ఎస్.సీ (కామన్ సర్వీస్ సెంటర్)ఆపరేటర్లు, పీఎంజీఏవై వెబ్‌సైట్‌లో లబ్ధిదారుడి ఆధార్ నంబర్ నమోదు చేయగానే పూర్తి స్థాయి వివరాలు కనిపిస్తాయి. ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యం పొందాలంటే, అర్హులైన వారి సెల్ నెంబర్, తెల్ల రేషన్ కార్డు నెంబర్, వ్యక్తి చిరునామా నమోదు చేయగానే వ్యక్తి సెల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. సెల్ నంబర్ అనుసంధానం లేకపోతే లబ్ధిదారుడి బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. జనవరి నెల నుంచి సీ.ఎస్.సీ ఆపరేటర్లు ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ అమలు కావడంతో గతంలో ఉన్న ఆరోగ్యశ్రీని పీఎంజేఏవైలో విలీనం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇంతకు ముందు ప్రజలకు రూ.2లక్షల వరకు ఉచిత వైద్యం అందించగా.. ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్రం నుంచి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రజలు మార్చి 31లోగా వారి పూర్తి వివరాలు నమోదు చేయించుకోవాలని జిల్లా అధికారులు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్‌తో ప్రతి వ్యక్తికి లబ్ధి



ప్రభుత్వం నుంచి వచ్చిన అర్హుల జాబితా ఆధారంగా వివరాలను నమోదు చేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ పథకంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే. సీ.ఎస్.సి సెంటర్‌లో ఈ కేవైసీ చేయించుకున్న తర్వాత ప్రతి ఒక్కరికి లబ్ధి కలిగే విధంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తాం. అలాగే సీ.ఎస్.సీ సెంటర్‌లో ఆపరేటర్ వద్ద తెల్ల రేషన్ కార్డు, సెల్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు ఇచ్చి ప్రజలు వారికి సహకరించాలి.

– బొజ్జ అరుణ్‌గౌడ్, సీఎస్‌సీ జిల్లా మేనేజర్

ఉద్యోగులతో

తెలంగాణ ప్రభుత్వానిది పేగు బంధం

- ఎవరెన్ని కుట్రలు చేసినా అనుబంధాన్ని దూరం చేయలేరు
- రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



విజేతలకు బహుమతి అందజేస్తున్న మంత్రి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యోగులకు, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య పేగు బంధం ఉందని, ఎవరెన్ని కుట్రలు చేసినా ఈ అనుబంధాన్ని ఎన్నటికీ విడదీయలేరని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మైదానంలో మూడు రోజుల పాటు కొనసాగిన టీఎన్జీవో 34వ జిల్లా స్థాయి అంతర్ శాఖల క్రీడా పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి క్రీడా పతాకాన్ని అవనతం చేసి పోటీలు ముగిసినట్టు ప్రకటించారు. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లను అభినందిస్తూ మెమొంటోలు అందజేశారు. తన తండ్రి స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి స్మారకార్థం ప్రత్యేకంగా క్రికెట్ పోటీలు నిర్వహించడం పట్ల టీఎన్జీవో జిల్లా కార్యవర్గానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనడం ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎంప్లాయ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మామిళ్ళ రాజేందర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్, ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి గజమాలతో సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న మంత్రి